క్లుప్తంగా

అల్బెండజోల్ మాత్రలు పంపిణీ

నందిగాం: స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్ అనిత ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలకు అల్బెండజోల్ మాత్రలను గురువారం సరఫరా చేశారు. పిల్లల్లో నులి పురుగుల నివారణకు ఈనెల 10వ తేదీన మాత్రలు అందజేయనున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజారావు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.40 వేల విరాళం



దాతకు అమ్మవారి ఫొటోను అందజేస్తున్న ఈవో రాధాకృష్ణ

టెక్కలి: కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి దేవస్థానంలో నిత్యాన్నదాన కార్యక్రమానికి దాతలు గురువారం రూ.40 వేలు విరాళంగా అందజేశారు. కోటబొమ్మాళి కర్ణాలవీధికి చెందిన ఆగూరు వెంకటేశ్వర పట్నాయక్, లత దంపతులు వారి పెళ్లిరోజు పురస్కరించుకొని దేవస్థానం ఈవో వి.రాధాకృష్ణకు విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఫొటోను దాతలకు అందజేశారు.

నేటి నుంచి వేంకటేశ్వరుని కల్యాణోత్సవాలు



విద్యుత్ దీపాలంకరణలో ఆలయం

కవిటి: మండలంలోని లోళ్లపుట్టుగలో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమవ్వనున్నాయి. దీనిలో భాగంగా సుప్రభాత సేవ, అభిషేకం, అర్చన, దీక్షాధారణ, కలశస్థాపన, హోమాలు, విశేష పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. మొత్తం మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంత చేయాలని కోరుతున్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ఏపీఎం ప్రసాదరావు

వజ్రపుకొత్తూరు: మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులు, సీసీలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని వెలుగు ఏపీఎం గొడబ ప్రసాదరావు సూచించారు. మండల మహిళా సమాఖ్య భవనంలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి గురువారం ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలు, వీవోలు, ఎంఎస్‌ల పాలన, సుపరిపాలన, నాయకత్వం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీలు రేణుక, నీలవేణి, వెంకటేష్, అకౌంటెంట్లు మీనా, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతుతున్న సీఐ విజయ్‌కుమార్

టెక్కలి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ కోరారు. మండలంలోని వంగర గ్రామంలో గురువారం రాత్రి సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు గురై భవిష్యత్ నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. అలాగే గ్రామ పరిధిలో మత్తు పదార్థాలు కనిపిస్తే తక్షణమే సమాచారం ఇవ్వాలని కోరారు.

స్కేటింగ్ విజేతలకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ:

తమిళనాడు రాష్ట్రం మదురలో జరిగిన నేషనల్ స్పీడ్ స్కేటింగ్ పోటీల్లో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన ఛాంపియన్ స్కూల్ విద్యార్థులు రాణించారు. 200 మీటర్ల స్పీడ్ స్కేటింగ్‌లో ఎస్.పార్థుసాయి, ఆయాన్, క్వాడ్ బాలికల విభాగంలో రాఘవి సిల్వర్ మెడల్స్ సాధించా రు. దీంతో వీరిని ప్రిన్సిపాల్ బోర శిరీష పాఠశాలలో గురువారం అభినందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బోర కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు.. ఇంకెంత దూరం..?

- మాటలకే పరిమితమవుతున్న హామీ
- పట్టించుకోని ప్రభుత్వం
- మోసపోయామని మహిళల ఆవేదన



నియోజకవర్గం	ఇచ్ఛాపురం	పలాస	టెక్కలి
మహిళల సంఖ్య	1,38,138	1,12,414	1,18,694

ఇచ్ఛాపురం రూరల్: అధికారంలోకి రావడానికి అలవికాని హామీలు ఇచ్చిన సీఎం చంద్రబాబునాయుడు, అధికారంలో కి వచ్చాక వాటిని పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో సూపర్-6 హామీలంటూ పెద్ద ఎత్తున కూటమి నేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. కానీ అధికారంలోకి వచ్చాక వాటి ఊసెత్తడం మానేశారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విషయంలో దసరా, సంక్రాంతి అంటూ రోజు కొక మాట చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో సర్వత్రా కూటమి ప్రభుత్వంపై మహిళలు విమర్శ లు చేస్తున్నారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో అధికంగా గ్రామీణ ప్రాంతాలు ఉన్నాయి. ప్రజలు వివిధ పనులు, కాలేజీలు, ఆస్పత్రులు, చిరు వ్యాపారాలు చేసుకోవడానికి నిత్యం మండల కేంద్రాలకు వెళ్తుంటారు. ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ప్రభుత్వం ఇచ్చిన హామీని ఖచ్చితంగా అమలు చేయాలని కోరుతున్నారు.

పండగల పేరుతో కాలయాపన

హామీ అమలుకు పండగల పేరుతో కూటమి నాయకులు కాలపయాపన చేస్తున్నారని మహిళలు విమర్శిస్తున్నారు. దసరా, దీపావళి, సంక్రాంతి అంటూ కప్పదాటు ప్రయత్నాలు చేస్తున్నారని దుమ్మెత్తిపోస్తున్నారు. పండగలు వెళ్తున్నా ప్రయాణంపై స్పష్టమైన ప్రకటన చేయడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హామీ అమలు చేయాలి



సూపర్-6లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. ప్రతీ పండక్కి పథకం అమలు చేస్తామంటూ చెబుతున్నారే తప్పా ఆచరించడం లేదు. మహిళలకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ప్రజలు ఓట్లేశారు. ఇప్పుడు చూద్దాం.. చేద్దాం అంటూ కాలయాపన చేయడం సరికాదు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ హామీపై మహిళలకు సమాధానం చెప్పాలి.

– బోర పుష్ప, ఎంపీపీ, ఇచ్ఛాపురం మండలం

నమ్మక ద్రోహం



కూటమి నేతల మాటలు నమ్మి మహిళలు ఓట్లేశారు. ఇప్పుడు హామీ అమలు చేయకుండా జాప్యం చేస్తున్నారు. అమలు చేస్తారన్న నమ్మకం కూడా సన్నగిల్లుతోంది. ఇదిగో.. అదిగో అంటున్నారు కానీ ఉచిత బస్సు ప్రయాణంపై స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. నమ్మి ఓట్లు వేసిన వారిని మోసం చేయడం సరికాదు. మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి.

– నర్తు రామారావు, ఎమ్మెల్సీ

ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహకాలు



టెక్కలి: కోటబొమ్మాళిలో అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన సిబ్బంది

టెక్కలి: ఆయిల్ పామ్ సాగుకు వందశాతం సబ్సిడీతో ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందజేస్తోందని ఉద్యానవన శాఖాధికారి కె.సునీత వెల్లడించారు. టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి తదితర మండలాల్లో రైతులకు చేపడుతున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఆమె మాట్లాడారు. ఏడాది కాలంలో ఎకరా పంట పొలంలో అత్యధిక దిగుబడి, ఆదాయాన్నిచ్చే ఆయిల్ పామ్ పంట సాగుపై రైతులు ఆసక్తి చూపాలని కోరారు. తెగుళ్ల బెడద లేకుండా ఈ సాగు చేసుకోవచ్చునని సూచించారు. రైతు సేవా కేంద్రం, ఉద్యానవన శాఖ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు. ఒక్కసారి నాటితే 25 నుంచి 30 సంవత్సరాల వరకు దిగుబడితో ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. నేషనల్ మిషన్ ఫర్ ఎడిబుల్ ఆయిల్ పామ్ పథకం ద్వారా శ్రీనివాస పామాయిల్ మిల్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సేవలు అందజేస్తారని ఆమె వెల్లడించారు.

వజ్రపుకొత్తూరు: ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఉద్యానవన శాఖ అధికారి కె.సునీత అన్నారు. మండలంలోని కవిటి అగ్రహారంలో సాగు చేస్తున్న పంటను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బెండిగేటు ప్రాంతంలోని కవిటి అగ్రహారం వద్ద 16 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో వజ్రపుకొత్తూరు, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం మండలాలను శాంతి ఆయిల్ పామ్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీకి కేటాయించడం జరిగిందన్నారు. ఏడాదికి 8 నుంచి 14 టన్నుల ఆయిల్ పామ్ గెలల దిగుబడి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 79950 86805 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

108 సిబ్బందికి శిక్షణ తరగతులు



శిక్షణకు హాజరైన సిబ్బంది

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి ఆవరణలో 108 సిబ్బందికి గురువారం జిల్లా ఏఈఎంఎస్ ఓఈ జగన్ పర్యవేక్షణలో ఆన్‌జాబ్ ట్రైనర్ నెయ్యిల కృష్ణ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో 108 సిబ్బందికి నూతన పోకడలకు అనుగుణంగా బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై అవగాహన కల్పించారు. 108 అంబులెన్స్‌లో ఉండే పరికరాలు, మందులు, వాటి ఉపయోగాల గురించి వివరించారు. కార్యక్రమంలో పలాస, టెక్కలి డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కంచిలి: మండలంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ ఎస్.గురవయ్య గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లలో మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్న దృష్ట్యా సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

సోంపేట: సోంపేట సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పలాస ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యజ్ఞేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సోంపేట, సోంపేట సబ్‌స్టేషన్, బిరుసువాడ, కుసుంపురం తదితర చోట్ల మరమ్మతులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని సోంపేట, బెంకిలి, జింకిభద్ర, పలాసపురం, రుషికుద్ద, ఇస్కలపాలేం పంచాయతీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక విద్యుత్ 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు జరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం కలుగుతుందని ఏఈ సుగ్గు హరీష్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ, మండల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ఆపరేషన్ కగార్ నిలుపుదల చేయాలి

పలాస: ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో కగార్ పేరుతో జరుగుతున్న నరమేధాన్ని తక్షణమే ఆపాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ రాష్ట నాయకుడు హరనాథ్ డిమాండ్ చేశారు. మండలంలోని బొడ్డపాడు గ్రామంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా వస్తున్న అటవీ చట్టాలను అదేవిధంగా కొనసాగించాలన్నారు. తరతరాలుగా అడవిలో ఉంటూ జీవిస్తున్న ఆదివాసీల జీవితాలను ఛిద్రం చేస్తే పౌర సమాజం క్షమించదన్నారు. అటవీ సంపద, ఆదివాసీల సంస్కృతీ, సాంప్రదాయాలను కాపాడాలని కోరారు.

ఈ-శ్రమ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

టెక్కలి: కార్మికులంతా ఈ-శ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు సూచించారు. గురువారం వెట్టి చాకిరీ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పట్టణంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ వ్యాపార, వాణిజ్య తదితర సంస్థల్లో పనిచేస్తున్నవారితో వెట్టి చాకిరీ చేయించడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో కార్మిక శాఖాధికారులు పి.సువర్ణ, ఆర్.రాధాకుమారి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వి.వివేకానంద, న్యాయవాదులు ఎం.గోవింద్, పి.మధుబాబు, ఎల్.బాలకృష్ణ, ఆర్.ప్రభుచంద్, ఎన్.మల్లేశ్వరరావు, పారా లీగల్ వలంటీర్స్ కె.ఇంద్రతనయ, జి.అరుణ తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా ప్రభుదాస్



ఎన్నికైన నూతన కార్యవర్గం సభ్యులు

ఇచ్ఛాపురం: నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా బి.ప్రభుదాస్‌ని పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం బెల్లుపడ కాలనీ చర్చిలో టెక్కలి డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ బిషప్ డా.డి.ఎస్.వి.ఎస్.కుమార్ అధ్యక్షతన ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలోని 40 మంది పాస్టర్స్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. నూతన కార్యవర్గం ఎంపిక ప్రక్రియను కంచిలి పాస్టర్ ఎం.శ్రీకాంత్ పర్యవేక్షించారు. అలాగే కార్యదర్శిగా సుందర్‌రాజు, కోశాధికారిగా ఎం.పాల్, సహాయ కార్యదర్శిగా వి.సాలేం నియమించబడ్డారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

సోంపేట: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జింకిభద్ర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.వేణుగోపాలరావు సూచించారు. పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు జుత్తు జగన్న మెమోరియల్ ట్రస్టు విశాఖపట్నం వారు మోడల్ పేపర్స్ గురువారం అందజేశారు. దీంతో ట్రస్టు సభ్యులకు పాఠశాల ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ఠోత్సవాలు



టెక్కలి మండలంలోని నరసింగపల్లి గ్రామంలో కోదండ రామాలయ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతీ పర్యవేక్షణలో వేద మంత్రాలతో ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఆరంభించారు. మూడు రోజుల పాటు జరగను న్న కార్యక్రమంలో భాగంగా, మొదటి రోజు కలశాలతో తిరువీధి కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. –టెక్కలి

నిరుపయోగం



స్వయం సహాయక సంఘాల సమావేశాలు, శిక్షణకు ఉపయోగించే ఇచ్ఛాపురంలోని ఇందిరా క్రాంతి భవనం నిరుపయోగంగా మారింది. ప్రస్తుతం నూతన భవనంలో సెర్ప్ కార్యక్రమాలు, సిబ్బంది విధులు నిర్వహిస్తుండడంతో పాత భవనాన్ని పట్టించుకోవడం లేదు. శిథిలావస్థ భవనాల్లో, ఇరుకు గదుల్లో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న మండల వ్యవసాయ శాఖ, గృహ నిర్మాణశాఖ, చిన్ననీటి పారుదల శాఖకు భవనాన్ని కేటాయిస్తే ప్రయోజనంతో పాటు వినియోగంలోకి వస్తుందని పలువురు సూచిస్తున్నారు. – ఇచ్ఛాపురం రూరల్

వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు



ఊక పాయింట్ పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ: రోడ్డు పక్కన ఉన్నటువంటి రైస్ మిల్లుల నుంచి వచ్చే ఊక, దుమ్మును రైస్‌మిల్ ప్రతినిధులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు స్పష్టం చేశారు. వీటివలన వాహనదారులకు ఇబ్బందులు కలిగితే రైస్ మిల్లులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 1వ వార్డు మొగిలిపాడు గ్రామం రోడ్డు పక్కన ఉన్న సాయికృష్ణ మోడ్రన్ రైస్‌మిల్‌ను సందర్శించి హెచ్చరికలు జారీ చేశారు. ఆయనతో పాటు మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలి



విద్యార్థులను పరీక్షిస్తున్న ఎంఈవో అప్పారావు

ఇచ్ఛాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగయ్యే విధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలని ఎంఈవో కురమాన అప్పారావు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని అమీన్‌సాహెబ్‌పేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించారు. విద్యార్థులకు అందజేస్తున్న రాగిజావ, మధ్యాహ్న భోజనం గురించి ఆరా తీశారు. అనంతరం పాఠశాల రికార్డులు పరిశీలించారు.

కొబ్బరి రైతులకు అవగాహన

కంచిలి: ఉద్యానవన పథకాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నా మని ఉద్యానశాఖ అధికారి పి.మాధవీలత పేర్కొన్నారు. మండలంలోని జాడుపూడి, కాకర్లపుట్టుగ గ్రామాల్లో కొబ్బరి రైతులతో గురువారం సమావేశమయ్యారు. కొబ్బరి బీమా కు సంబంధించి రైతు లు తమ తోటలో ఉన్నటువంటి 4 నుంచి 15 సంవత్సరాలు, 16 నుంచి 60 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న ఆరోగ్యకరమైన చెట్లకు 1, 2, 3 సంవత్సరాలకు ఇన్సూరెన్స్ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జాడుపూడి, కాకర్లపుట్టుగ గ్రామాల కొబ్బరి రైతులు, ఉద్యానశాఖ విస్తరణ అధికారి బాలరాజు, ఏంపీఈవో లలిత, గ్రామ ఉద్యాన సహాయకురాలు శాంతమ్మ, వ్యవసాయ సహాయకురాలు ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

అధ్వానం



వజ్రపుకొత్తూరు మండలంలోని మంచినీళ్లపేట- బెండి, మంచినీళ్లపేట- పూండి వయా రెయ్యిపాడు రహదారులు అధ్వానంగా ఉన్నాయి. మూడు నెలల క్రితం రోడ్డు మరమ్మతులు చేపట్టేందుకు తవ్వారు. ప్రస్తుతం రాళ్లు తేలిపోవడంతో కొండవూరు, బెండి, తేరపల్లి, హుకుంపేట, రెయ్యిపాడు, పీజేపురం గ్రామాలకు నడిచి వెళ్లేందుకు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. అంతేకాకుండా రహదారిపై దుమ్ము చెలరేగి వాహన చోదకులు అనారోగ్యం పాలవుతున్నారు. అందువలన అధికారులు స్పందించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. – వజ్రపుకొత్తూరు

విద్యార్థులు ప్రణాళికతో చదవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రమోద్‌కుమార్ పాడీ

ఇచ్ఛాపురం రూరల్: ఒడియా భాషా మాధ్యమం విద్యార్థులు ప్రణాళికతో చదివితే విజేతలుగా నిలుస్తారని కవిటి మండలం సహలాలపుట్టుగ ఒడియా ఉన్నత పాఠశాలకు చెందిన బయాలజీ ఉపాధ్యాయుడు ప్రమోద్ కుమార్ పాడీ అన్నారు. ఇచ్ఛాపురం మండలంలోని కొళిగాం ఉన్నత పాఠశాలలో ఒడియా మాధ్యమంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై గురువారం పలు సూచనలు అందించారు. పరీక్షలు సమయంలో ఒత్తిడికి లోనవ్వకుండా ఉండాలని, ఆహార నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరేంద్రనాథ్ పట్నాయక్ ఉన్నారు.

‘టిమ్స్’ షోకాజ్ నోటీసులు అన్యాయం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్

కాశీబుగ్గ: ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు అందించిన టిమ్స్ మెషీన్లు కొన్నిసార్లు బస్సులోనే పాడైపోతున్నాయని, వాటికి డేమేజ్ కాస్ట్ పేరిట రూ.5 వేల నుంచి రూ.20 వరకు రికవరీ చేయడం అన్యాయమని, ఇదే విషయంలో షోకాజ్ నోటీసులు జారీ చేయడం సరికాదని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్ అన్నారు. ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కౌన్సిల్ సమావేశం పలాస ఈస్టుకోస్టు రైల్వే శ్రామిక యూనియన్ కార్యాలయం ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. ఉద్యోగులకు రావాల్సిన 2017 పీఆర్‌సీఎస్ ఆర్‌బీఎస్ ఎస్‌బీటీ బకాయిలు వెంటనే ఇప్పించాలన్నారు. విజయనగరం జోనల్ సెక్రటరీ భాసూరు కృష్ణమూర్తి మాట్లాడుతూ శ్రీకాకుళం డిపో-2 మేనేజర్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ జరిమానాలు విధించడం తగదన్నారు. మేనేజర్ వైఖరిపై ఆర్టీసీ ఎండీకి, విజయనగరం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు, జిల్లా ప్రజారవాణా అధికారికి ఫిర్యాదు చేస్తామని, అప్పటికీ తీరుమారకపోతే జోన్‌స్థాయిలో ఆందోళన చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జోనల్ నాయకులు రాజు, జిల్లా అధ్యక్షుడు దశరథుడు, రీజనల్ మెంబర్లు పి.వి.ఆర్.లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.